క్లుప్తంగా

జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు పవన్



పవన్‌ను అభినందిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతం బాలాజీనగర్‌కు చెందిన ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్న పవన్ జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల సిక్కిం రాష్ట్రంలో జరిగిన ఆరో యూత్ నేషనల్ బాక్సింగ్ పోటీలలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన పవన్ జాతీయ పోటీలకు అర్హత సాధించాడు. ఈ మేరకు సోమవారం పెదగదిలిలోని క్యాంప్ కార్యాలయంలో ఆయనను మేయర్ గొలగాని హరివెంకటకుమారి అభినందించారు. జూన్ 12 నుంచి 19వ తేదీ వరకు జరగనున్న జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో సత్తా చాటాలని మేయర్ ఆకాంక్షించారు. పవన్ ప్రస్తుతం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో బాక్సింగ్‌లో శిక్షణ పొందుతున్నాడు. పవన్ తండ్రి ఆటో డ్రైవర్ కావడం విశేషం.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచి, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట అర్చకులు పూజ నిర్వహిస్తారు. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలని ఆలయ అధికారులు కోరారు.

యోగా, తెలుగు పద్య పఠనంపై అవగాహన



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

ఎంవీపీ కాలనీ: స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు నిపుణులైన అధ్యాపకులు తెలుగు పద్యపఠనం, తెలుగు వ్యాకరణంపై అవగాహన కల్పించారు. విద్యార్థి దశలోనే మాతృభాష తెలుగుపై పట్టు సాధించాలని సూచించారు. తద్వారా విద్యార్థుల్లో భాషా నైపుణ్యం పెరుగుతాయన్నారు. వ్యాకరణంలో మెలుకువలు తెలియజేశారు. అనంతరం యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. పలు యోగాసనాలు విద్యార్థులతో వేయించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

తీరం చెత్తమయం.!



తీరంలో చెత్త కుప్ప

బీచ్‌రోడ్డు: నిరంతరం సందర్శకులతో కిటకిటలాడే సాగరతీరం.. జీవీఎంసీ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా చెత్తతో నిండిపోయింది. స్వచ్ఛభారత్‌లో భాగంగా కొంత మంది తీరం వెంబడి ఉన్న చెత్తను సేకరించి ఓ చోట వేసినా జీవీఎంసీ సిబ్బంది పట్టుకెళ్లకుండా అక్కడే విడిచిపెట్టేస్తున్నారు. దీంతో శునకాలు వచ్చి ఆ చెత్తను తీరంలో చెల్లాచెదురు చేస్తున్నాయి. ఇప్పటికైనా జీవీఎంసీ సిబ్బంది స్పందించి తీరం శుభ్రతకు చర్యలు తీసుకోవాలని సందర్శకులు కోరుతున్నారు.

తుక్కు దుకాణాలతో ముప్పు.!



సుందరయ్య కాలనీలో ఇళ్ల మధ్య తుక్కు దుకాణం



అంబేద్కర్‌నగర్‌లో నివాసాలు, షాపుల మధ్య స్క్రాప్ షాపు

- ఆరిలోవలో కనీస నిబంధనలు పాటించని వ్యాపారులు
- పలు చోట్ల అగ్ని ప్రమాదాలతో కలవరం

ఆరిలోవ: యథేచ్ఛగా తుక్కు(స్క్రాప్) దుకాణాల ఏర్పాటుతో ఆరిలోవ ప్రాంతవాసులు బెంబేలెత్తిపోతున్నారు. షాపుల వద్ద కనీస జాగ్రత్త చర్యలు కానరాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. తాజాగా ఆదివారం పరవాడ మండలంలో నివాసాల మధ్య ఉన్న స్క్రాప్ షాపులో సంభవించిన అగ్ని ప్రమాదాన్ని గుర్తు చేసుకుని కలవరపడుతున్నారు. ఆరిలోవ ప్రాంతంలో పలు చోట్ల తుక్కు దుకాణాలు ఇళ్ల మధ్యలోనే ఉన్నాయి. ఎవరైనా స్క్రాప్ వ్యాపారం చేసుకోవచ్చు. కానీ నివాసాల మధ్య కాకుండా దూరంగా ఖాళీ స్థలాల్లో ఇలాంటి వ్యాపారాలు చేసుకుంటే బాగుంటుందని స్థానికులు కోరుతున్నారు. గతంలో ఇక్కడ సంభవించిన అగ్ని ప్రమాదాలను గుర్తు చేసుకుని ఆందోళన చెందుతున్నారు.



శ్రీకాంత్‌నగర్‌లో తుక్కు దుకాణం

- జీవీఎంసీ 12వ వార్డు సుందరయ్యకాలనీ, శ్రీకాంత్‌నగర్, చినగదిలి, పార్వతీనగర్, 13వ వార్డులో ఆరిలోవ కాలనీలో తుక్కు దుకాణాలు నివాసాల మధ్య నిర్వహిస్తున్నారు. సుందరయ్య కాలనీలో ఓ వ్యాపారి లీజుకు తీసుకున్న రెండు స్థలాలతో పాటు పక్కనే ఖాళీగా ఉన్న రెవెన్యూ స్థలాన్ని సైతం అనధికారంగా వినియోగించుకుంటున్నాడు. ఆయా స్థలాల్లో వందలాది కేజీల తుక్కు మూటలు నిల్వ చేశారు. ఇతర ప్రాంతాల నుంచి తుక్కును తీసుకొచ్చినప్పుడు, దుకాణం నుంచి తుక్కును వేరే చోటకు తరలించినప్పుడు వ్యాన్లతో హడావుడి చేస్తుండడం మరింత ఇబ్బందిగా మారింది. ఇక్కడ చిన్న రోడ్డు కావడంతో పాటు నివాసాల మధ్య రాత్రి పగలు తేడా లేకుండా వాహనాల రాకపోకలతో స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు.
- శ్రీకాంత్‌నగర్‌లో రెండు చోట్ల తుక్కు దుకాణాలు ఇళ్ల చెంతనే ఉన్నాయి. వీటిల్లో రెండేళ్ల క్రితం ఓ దుకాణంలో అగ్ని ప్రమాదం సంభవించింది. ప్లాస్టిక్ వ్యర్థాలు కాలిపోయి దట్టమైన పొగలు ఎగసిపడ్డాయి. ఆ పొగ నివాసాలలోకి చేరడంతో స్థానికులు ఊపిరి పీల్చుకోవడానికి ఇబ్బందిపడ్డారు.
- పార్వతీనగర్‌లో ప్రధాన రహదారి పక్కన నిర్వహిస్తున్న తుక్కు దుకాణంలో ప్లాస్టిక్ వ్యర్థాలు, మూటలు రోడ్డు మీదే నిల్వ ఉంచుతున్నారు. వాటిని వ్యాన్లలో తరలించేటప్పుడు ఆ దారిన వెళ్లే వాహణచోదకులకు ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది.
- చినగదిలిలో ఓ వ్యక్తి ఫుట్‌పాత్‌పైనే తుక్కు మూటలు, ఇనుప రాడ్లు, ఊచలు నిల్వ చేస్తున్నాడు. దీంతో ఈ ఫుట్‌పాత్ పాదచారులు వినియోగించడానికి వీల్లేకుండాపోయింది.
- ఆరిలోవ కాలనీలో కూడా తుక్కు దుకాణం నివాసాల మధ్య ఉండడంతో స్థానికులకు ఇబ్బంది తప్పడం లేదు. వర్షాలు పడుతున్న సమయంలో ఈ తుక్కు మూటల నుంచి దుర్వాసన వస్తుందని చెబుతున్నారు. ఈ షాపుల వద్ద ఎటువంటి భద్రత చర్యలు చేపట్టిన దాఖాలు లేవు.

దూర ప్రాంతాలకు తరలించాలి

అగ్ని ప్రమాదాలు జరగకుండా అధికారులు ముందు జాగ్రత చర్యలు చేపట్టాలి. వీటిని నివాసాల మధ్య నుంచి దూర ప్రాంతాలకు తరలించాలి. గతంలో శ్రీకాంత్‌నగర్‌లో తుక్కు దుకాణంలో అగ్ని ప్రమాదం జరిగింది. అప్పుడు వచ్చిన పొగతో చుట్టు పక్కల నివాసితులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఆదివారం పరవాడ ప్రాంతంలో తుక్కు దుకాణంలో జరిగిన అగ్ని ప్రమాదం లాంటిది ఇక్కడ కూడా జరగకముందే అధికారులు చర్యలు తీసుకోవాలి. – **ఆర్.శ్రీనివాసరావు, శ్రీకాంత్‌నగర్**

దుర్వాసనతో అవస్థలు

సుందరయ్య కాలనీలో నిర్వహిస్తున్న తుక్కు దుకాణం నుంచి వస్తున్న దుర్వాసనతో అవస్థలు పడుతున్నాం. ఇక్కడున్న చిన్న రోడ్డు పక్కనే మూడు స్థలాల్లో తుక్కు మూటలను నిల్వ ఉంచుతున్నారు. వర్షాలు పడినప్పుడు అవి తడిసిపోయి దుర్వాసన వస్తుంది. మూటలను వ్యాన్లలోకి లోడింగ్ చేసినప్పుడు రోడ్డుపై వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నాం.

– **పి.ఆదినారాయణ, లీలాసుందరయ్య కాలనీ**

స్క్రాప్ షాపులు పరిశీలించి చర్యలు

ఆరిలోవలో స్క్రాప్ దుకాణాలు ఎక్కువగానే ఉన్నాయి. ఇటువంటి దుకాణాలు స్థానికులకు ఇబ్బంది కలగకుండా నివాసాలకు దూరంగా నిర్వహించుకోవాలి. ఎక్కువ నిల్వలు ఉంటే అగ్ని ప్రమాదాలకు ఆస్కారం ఉంటుంది. తుక్కు దుకాణాలు ఎక్కడెక్కడ ఉన్నాయో పరిశీలిస్తాం. ఆరిలోవ ప్రాంత వాసులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపడతాం.

– **కనకమహాలక్ష్మి, జీవీఎంసీ జోన్–2 కమిషనర్**

డివైడర్‌ను ఢీకొని వ్యక్తి దుర్మరణం

ఎచ్చెర్ల క్యాంపస్: ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో ఒకరు ప్రాణాలు కోల్పోగా మరొకరు క్షేమంగా బయటపడ్డారు. అల్లినగరం జంక్షన్ వద్ద సోమవారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటనలో విశాఖ అర్బన్‌కు చెందిన రాపర్తి వెంకటసత్య రాఘవేంద్ర (39) ప్రాణాలు కోల్పోయినట్టు పోలీసులు తెలిపారు. వెంకటసత్య రాఘవేంద్రతో పాటు మరో వ్యక్తి శ్రీకాకుళంలో జరిగిన ఓ ఫంక్షన్‌లో వంటలు చేసిన తరువాత తిరిగి ద్విచక్ర వాహనంపై విశాఖకు వెళ్తున్నారు. అల్లినగరం జంక్షన్ వద్ద వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో వెంకటసత్య రాఘవేంద్ర అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. వెనుక కూర్చున్న వ్యక్తి క్షేమంగా బయటపడ్డారు. ఆధార్ కార్డు, వెనుక కూర్చున్న వ్యక్తి సమాచారం మేరకు కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఎస్సై వి.సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బిట్స్ కళాశాల పరిశీలన

పీఎం పాలెం: జీవీఎంసీ 6వ వార్డులో గల బిట్స్ ఇంజినీరింగ్ కళాశాలను (బాబా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్) నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (ఎన్ఏఏఎస్) బృందం సోమవారం పరిశీలించింది. కళాశాలలో విద్యార్థులకు కల్పించిన మౌలిక సదుపాయాలు, లేబొరేటరీ, గ్రంథాలయం, హాస్టల్ వసతిపై వివరాలు సేకరించారు. ప్రిన్సిపాల్ గోవిందరాజు కళాశాల నిర్వహణ తీరును వివరించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కళాశాల కరస్పాండెంట్ కె.శ్రీలక్ష్మి, అకడమిక్ డైరెక్టర్ సీవీ గోపీనాథ్ పాల్గొన్నారు.

బీఆర్‌టీఎస్ రోడ్డులో కమిషనర్ పర్యటన

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రోడ్డును పరిశుభ్రంగా ఉంచాలని శానిటరీ అధికారులను జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశించారు. సోమవారం ఆయన హనుమంతవాక నుంచి అడవివరం వరకు బీఆర్‌టీఎస్ రోడ్డులో పర్యటించారు. రోడ్డు పక్కన కారిడార్లలో పలు చోట్ల చెత్త కుప్పలు, వ్యర్థాలు ఉండడాన్ని ఆయన గమనించారు. ఈ రోడ్డులో వ్యర్థాలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని తొలగించి శుభ్రం చేయించాలని అధికారులకు సూచించారు. ఖాళీ సీసాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌లను వ్యాపారులు ఆక్రమిస్తున్నారని, తక్షణం తొలగించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. రోడ్డుపై ఇసుక లేకుండా స్వీపింగ్ యంత్రాలతో శుభ్రం చేయించాలన్నారు. బీఆర్‌టీఎస్ డివైడర్లలో పచ్చదనం కోసం నాటించిన మొక్కలకు ప్రతి రోజు క్రమం తప్పకుండా నీరు పోయాలన్నారు.

ఆకతాయిల ఆగడాలు!



కాళ్లు విరగ్గొట్టడంతో ఒంటె బొమ్మ ఇలా..

ఎంవీపీ కాలనీ: స్థానిక ఏఎస్ రాజా మైదానంలో ఏర్పాటు చేసిన ఒంటె బొమ్మ కాళ్లను గుర్తుతెలియని దుండగులు విరగ్గొట్టారు. ఇటీవల ఈ ఘటన జరగ్గా స్థానికులు ఆలస్యంగా గుర్తించారు. కాలనీ బ్యూటీఫికేషన్‌లో భాగంగా కూడళ్లను గతంలో జీవీఎంసీ సుందరీకరించింది. జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఈ పనులు జరిగాయి. ఇందులో భాగంగా కళాకారులతో తయారు చేయించిన పలు జంతువుల విగ్రహాలను కూడళ్లలో ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఏఎస్ రాజా మైదానంలో ఒంటె బొమ్మను ఏర్పాటు చేయడంతో ఆ కూడలి ఆకర్షణీయంగా మారింది. కొంతకాలంగా స్థానికులను, పిల్లలను ఆకట్టుకుంటున్న ఈ ఒంటె బొమ్మను విరగ్గొట్టారు. దీంతో అది ఫుట్‌పాత్‌పై పడిపోయింది. నాలుగు కాళ్లను సమాంతరంగా కావాలనే ఆకతాయిలు కట్ చేశారని స్థానిక అసోసియేషన్స్ నాయకులు వెల్లడిస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

13న మొగదారమ్మ పండగ

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు గొల్లల ఎండాడ, ముసలయ్యపాలెం గ్రామ దేవత మొగదారమ్మ అమ్మవారి పండగ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. జూన్ 4 నుంచి 13 వరకు అమ్మవారి మహోత్సవాలు నిర్వహించనున్నారు. 12న తొలేళ్లు, 13న అమ్మవారి అనుపోత్సవం నిర్వహించనున్నారు.

నిర్లక్ష్య డ్రైవింగ్‌తో ప్రమాదాలు



ప్రమాదాల దృశ్యాలను తెరపై ప్రదర్శిస్తున్న పోలీసులు

ఆనందపురం : రవాణా శాఖ నిబంధనలను అనుసరిస్తే రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చని ఆనందపురం ట్రాఫిక్ ఎస్ఐ రఘురామ్ సూచించారు. నిర్లక్ష్య డ్రైవింగ్ వల్ల జరిగిన ప్రమాద సంఘటనలను ఆనందపురం జంక్షన్, పూల మార్కెట్ వద్ద సంచార వాహనం తెరపై సోమవారం ప్రదర్శించి అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రఘురామ్ మాట్లాడుతూ రోడ్డు నుంచి మరో రోడ్డుకి మళ్లేటప్పుడు, కూడళ్ల వద్ద మలుపులు తీసుకున్నప్పుడు, అలాగే ముందు వెళ్లే వారిని అధిగమించడానికి మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయని వివరించారు. మైనర్లు డ్రైవింగ్ చేస్తే తల్లిదండ్రులను బాధ్యులను చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆటో, వ్యాన్, లారీ డ్రైవర్లు పాల్గొన్నారు.

పంచాయతీ పారిశుధ్య కార్మికుల నిరసన



నిరసన ప్రదర్శన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

మహారాణిపేట: జిల్లాలోని పంచాయతీల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ యునైటెడ్ గ్రామ పంచాయతీ శానిటరీ వర్కర్స్ యూనియన్ జిల్లా శాఖ(ఏయూటీయూసీ) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బకాయి జీతాలు చెల్లించాలని, అసంఘటిత కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, గుర్తింపు కార్డులు అందించాలని, ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం



జీలకర్ర బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు.

విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణ ధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్య ధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రా లు అందజేశారు. అర్చకులు శ్రావణ్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

రూ.50 కోట్లతో పరిశోధన కేంద్రాలు

కొమ్మాది: శాస్త్ర పరిశోధనలు బలోపేతం చేయడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం రూ.50 కోట్లతో పరిశోధన కేంద్రాలను అభివృద్ధి చేస్తుందని వీసీ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం తెలిపారు. గీతం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కేంద్రం ఆధ్వర్యంలో నూతన అధ్యాపకులకు అవగాహన తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధనతోపాటు పరిశోధనల్లో విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ స్థాయిలో నిలపడానికి ప్రణాళికాయుతంగా కృషి చేస్తున్నామని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్నందున బోధనా పద్ధతులు మార్చుకోవాలని సూచించారు.

కొత్తమ్మవారికి తులసి మాలలతో అలంకరణ



తులసి మాలల అలంకరణలో కొత్తమ్మతల్లి

తగరపువలస: జీవీఎంసీ 1, 2 వార్డులకు చెందిన సంతపేట, కొత్తపేట తదితర గ్రామాల ఆరాధ్యదేవత కొత్తమ్మతల్లిని సోమవారం తులసిమాలలతో అలంకరించారు. మంగళవారం అమ్మవారిని ఈ అలంకరణలో భక్తులకు దర్శనాలు కల్పించనున్నారు. రెడ్డి రాయల్ యూత్ ఆధ్వర్యంలో అలంకరణకు దాతలు సరగడ బుజ్జి, జీరు సంతోష్, కె.సోమేశ్వరరావు సహకరించగా భీమిలి మండలం చిప్పాడకు చెందిన సాడి కుమార్, వెంపాడ రామిరెడ్డి అలంకరణ చేశారు.

చంద్రబాబుకు పేదలంటే చులకన



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు అక్కరమాని వెంకటరావు, తదితరులు

- అందుకే ఇళ్ల స్థలాలపై అనుచిత వ్యాఖ్యలు
- వైఎస్సార్‌సీపీ నేత అక్కరమాని ధ్వజం
- 'తూర్పు'లో భారీ బైక్ ర్యాలీ

ఎంవీపీ కాలనీ: టీడీపీ అధినేత చంద్రబాబు వెనకబడిన వర్గాలపై కించపరిచే వ్యాఖ్యలు మానుకోవాలి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అక్కరమాని వెంకటరావు డిమాండ్ చేశారు. అమరావతిలో 50 వేల మంది పేదలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు పంపిణీ చేయడంపై చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బాబు వ్యాఖ్యలను ఖండిస్తూ తూర్పు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆధ్వర్యంలో సోమవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎంవీపీ కాలనీ టీటీడీ సర్కిల్ నుంచి బీచ్‌రోడ్డులోని వైఎస్సార్ విగ్రహం వరకు సాగిన ఈ ర్యాలీని వెంకటరావు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల్లోని పేదలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రికార్డు స్థాయిలో ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారన్నారు. పేదల సంక్షేమం కోసం ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తే దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారన్నారు. ఈ వ్యాఖ్యలను బట్టి బాబుకు ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమంపై ఏమాత్రం ప్రేమ ఉందో అర్థమవుతుందన్నారు. అమరావతిలో పేదలకు చోటు లేదని ప్రకటించిన చంద్రబాబు, 14 ఏళ్ల సీఎంగా ఉన్న సమయంలో ఏనాడైనా ఇలాంటి మహత్తర కార్యక్రమం నిర్వహించారా? ప్రశ్నించారు. రాష్ట్ర అదనపు కార్యదర్శి మొల్లి అప్పారావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ , బీసీలంటే చంద్రబాబుకు తొలినుంచి చులకన భావం ఉందన్నారు. అందుకే పేదలకు పంపిణీ చేసిన సెంటు స్థలాన్ని శ్మశాన వాటికతో పోల్చారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు అక్కరమాని రోహిణి, ముమ్వల లక్ష్మి, అప్పారి శ్రీవిద్య, గేదెల లావణ్య, గుడ్ల సత్యసాయి, ఉమ్మిడి స్వాతి, కెల్లా సునీత, ముఖ్య నాయకులు అప్పారి గిరిబాబు, ముమ్వల సురేష్, గుడ్ల సత్యారెడ్డి, ఉమ్మిడి దాసు, జగ్గుపల్లి అప్పలరాజు, పల్లా దుర్గారావు, సురాడ దాసు, పీతల గోవింద్, పుక్కళ్ల ధనలక్ష్మి, ప్రసాదల భాగ్యానంద్, రవికుమార్ పాల్గొన్నారు.

సాలిపేటలో సమస్యలు పరిష్కరించాలి



సాలిపేట వాసులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ రోహిణి

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు కొండవాలు ప్రాంతం సాలిపేటలోని సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ అక్కరమాని రోహిణిని స్థానికులు కోరారు. కాలనీలో సోమవారం కార్పొరేటర్ పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో రోడ్లు, కాలువలు, పారిశుధ్యం, నీటి సరఫరా, వీధి దీపాలు తదితర వాటిని పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వీధి దీపాలు వెలగకపోవడం, కాలువల్లో చెత్త పేరుకుపోవడం, కుళాయి నీరు సక్రమంగా సరఫరా కాకపోవడం, శిథిలమైన రోడ్లు, తదితర సమస్యలు స్థానికులు ఆమెకు వివరించారు. ఆయా విభాగాల అధికారుల దృష్టికి సమస్యలు తెలియజేసి పరిష్కరిస్తానని స్థానికులకు ఆమె హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కన్నేటి సుబ్బారెడ్డి, కొండమ్మ, రాజు, శ్రీనివాస్, నీటి సరఫరా విభాగం వర్క్ ఇన్‌స్పెక్టర్ శేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇండో నేపాల్ కరాటేలో ప్రతిభ



పతకాలు సాధించిన కరాటే వెపన్స్ కాటా పిల్లలు

దాబాగార్డెన్స్: స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఇండో నేపాల్ కరాటే పోటీల్లో నగరానికి చెందిన కరాటే వెపన్స్ కాటా పిల్లలు ప్రతిభ సాధించారు. పలు విభాగాల్లో జరిగిన పోటీల్లో అల్లిపిల్లి లక్ష్మీనారాయణ(బంగారం), కొయ్య లోకేష్(రజతం), శ్రీరామ్ ఉదయ్ ఈశ్వర్ (కాంస్యం), అల్లిపిల్లి శ్రీమన్నారాయణ(రజతం), కె.కుశ్వంత్‌కుమార్(బంగారం), వినయ్ ఈశ్వర్ (కాంస్యం), కోళ్ల అజయ్(కాంస్యం), కొతరపు భార్గవ్(కాంస్యం), గుసిడి సాయిబాలాజీ(కాంస్యం), దొరసింగి తనీష్వర్(వెండి), గుజ్జు వరుణ్‌తేజ్(కాంస్యం), గుడె అంకిత్(బంగారం), డొక్కర జ్యోత్స్నవి సాయి(వెండి), గుసిడి కార్తీక(వెండి), కోళ్ల శరణ్య(వెండి), వాసుపల్లి దివ్య అంజలి(బంగారం), కొతరపు యస్విని(కాంస్యం), రాఘని హునార్(బంగారం), జక్కా షణ్ముఖ ప్రియ(బంగారం), ఎం కేశవ హర్షిత సాయి(బంగారం), రాగణి వరుణ్(కాంస్యం), ఎం.హవిష సాయి(కాంస్యం), దామోదర భువనేష్(కాంస్యం), పీతల ఉజ్వల్(కాంస్యం), ఉమ్మిడి అశ్వినీకుమార్(బంగారం), వంకా రాజు(వెండి), ఎం.కార్తికేయన్(బంగారం) పతకాలు సాధించారని కోచ్ శ్రీనివాసరావు తెలిపారు. పతకాలు సాధించిన వారిని సోమవారం అభినందించారు.

రైతుబజారులో ఘర్షణ

బీచ్ రోడ్డు: పెదవాల్తేరు రైతుబజారులో ఓ మహిళా రైతు, వినియోగదారుడు నడుమ జరిగిన ఘర్షణ పోలీసు స్టేషన్ వరకు దారితీసింది. వివరాలిలా ఉన్నాయి. రైతుబజారులో మహిళా రైతు వద్ద ఓ వినియోగదారుడు దానిమ్మ పండ్లు కొనుగోలు చేయగా.. అందులో ఒకటి పూర్తిగా పాడైపోయింది. దీంతో ఆయన ఆ పండును మార్చాలని కోరారు. ఈ విషయమై ఇద్దరు మధ్య తీవ్ర ఘర్షణ చోటు చేసుకోవడంతో పోలీసులకు మహిళా రైతు ఫిర్యాదు చేశారు.

10న గీతం స్నాతకోత్సవం

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం 14వ స్నాతకోత్సవాన్ని జూన్ 10న నిర్వహించనున్నట్టు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ తెలిపారు. గీతం స్నాతకోత్సవానికి భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం కార్యదర్శి డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై పట్టభద్రులను ఉద్దేశించి ప్రసంగిస్తారని తెలిపారు. గీతం విశాఖ ప్రాంగణం నుంచి ఇంజినీరింగ్, ఆర్కిటెక్చర్, ఫార్మసీ, లా, నర్సింగ్, మేనేజ్‌మెంట్, సైన్స్, సామాజిక శాస్త్రాలను పూర్తి చేసిన విద్యార్థులు గీతం వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో స్నాతకోత్సవ పట్టాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

పాలిటెక్నిక్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం



సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

సింహాచలం: పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం నుంచి పాలిసెట్–2023లో ర్యాంకులు సాధించిన విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభమైంది. విద్యార్థు ల సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ ప్రారంభించారు. తొలి రోజు 85మంది విద్యార్థులు హాజరయ్యారు. 293 ర్యాంక్ సాధించిన కె.సాయిసాత్విక్, 862 ర్యాంక్ సాధించిన ఎస్ నిహారిక సర్టిఫికెట్లు వెరిఫికేషన్‌కి వచ్చారు. 5వతేదీ వరకు సర్టిపికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తెలిపారు.